క్లుప్తంగా

నేడు పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

చేవెళ్ల/మొయినాబాద్: పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించటంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ చేవెళ్ల, మొయినాబాద్ నగర కార్యదర్శులు శివ, బట్టు వినయ్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలలు బందుకు పిలుపునిచ్చిందని దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ పాఠశాలల యాజమాన్యాలకు ఇప్పటికే బంద్ నోటీసులు అందజేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేదని, ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ జరుగుతుందని జీఓ 117 వల్ల విద్యార్థులకు చదువు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించటంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మెగా డీఎస్సీ విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యల ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్, వేణు, ప్రేమ్, భార్గవ్‌రామ్ తదితరులు ఉన్నారు.

సీఐల బదిలీలు

షాద్‌నగర్: నియోజకవర్గ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ పట్టణ సీఐగా పని చేస్తున్న నవీన్‌కుమార్, నందిగామ సీఐ రామయ్యను సీపీఓ క్రైమ్ వింగ్‌కు, కొత్తూరు సీఐ బాల్‌రాజ్‌ను సనత్‌నగర్‌కు బదిలీ చేశారు. షాద్‌నగర్ పట్టణ సీఐగా ఆర్‌సీ పురం పోలీస్ స్టేషన్‌లో డీఐగా పని చేసిన ప్రతాప్‌లింగం, నందిగామ సీఐగా సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తున్న సురేశ్ బదిలీపై రానున్నారు. కొత్తూరు సీఐని ఇంకా నియమించ లేదు.

చేవెళ్ల ట్రాఫిక్ సీఐగా ఎం.ముత్తు యాదవ్



చేవెళ్ల: చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్‌గా ఎం.ముత్తు యాదవ్ నియమితులయ్యారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేసిన వాసుకు డీఎస్పీగా పదోన్నతి లభించటంతో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ పోస్టు ఖాళీగా ఉండడంతో సనత్‌నగర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.ముత్తు యాదవ్‌ను చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలకు వచ్చిన వారితో డాక్టర్లు

కేశంపేట: ఇండియన్ మెడికల్ అసోషియేషన్(ఐఎంఏ) షాద్‌నగర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు రమేశ్ బండారి, చందులాల్ రాథోడ్, నాగవర్ధన్ రెడ్డి, కార్తీక్, లాల్‌కుమార్, కిరణ్‌కుమార్‌లు 150 మంది రోగులకు పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. అవసరమైన వారికి టెస్టులను చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, ఉప సర్పంచ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో అభివృద్ధి పనులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో స్థానిక నాయకుడు వీరమోని దేవేందర్‌ముదిరాజ్ ఆదివారం పలు అభివృద్ధి పనులు చేపట్టారు. విద్యుత్ సమస్యను అధికారులతో కలిసి పరిష్కరించడానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు ఆయన తన సొంత ఖర్చులతో పనులు చేయించడంతో కాలనీవాసులు ఆయన్ను అభినందించారు. తనవంతుగా రానున్న రోజుల్లో కాలనీలో మరిన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు దేవేందర్ ముదిరాజ్ వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కులేని వారే బీఆర్‌ఎస్‌లో చేరిక

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశ్

కేశంపేట: పార్టీ సభ్యత్వం, ఓటు హక్కులేని వారే బీఆర్‌ఎస్‌లో చేరారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ వీరేశ్ అన్నారు. శనివారం చౌలపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో స్పందించిన సర్పంచ్ వీరేశ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం లేని వారిని పార్టీలో చేర్చుకుని కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు నాయకులను ప్రలోభాలకు గురి చేసి బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారన్నారు.

కురిసిన వాన.. మురిసిన రైతు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోస్తున్నాయి. వర్షం కోసం ఎదురుచూసిన అన్నదాత ఆనందంతో మురిసిపోతున్నాడు. మొదట్లో కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతులు పత్తి, కంది విత్తనాలు విత్తుకున్నారు. వర్షం కురిస్తే వెంటనే మొలకెత్తుతాయనే ఆశలో ఉండగా వరుణుడు ముఖం చాటేశాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు ఆనందపడుతున్నారు.



చేవెళ్లలో విత్తనాలు వేస్తున్న రైతులు

- సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాత
- ఎరువులు, విత్తనాల సమస్యలు తలెత్తకుండా వ్యవసాయాధికారుల చర్యలు

చేవెళ్ల: వానాకాలం పంటలసాగుకు సిద్ధమైన రైతులను ఎట్టకేలకు వరుణ దేవుడు కరుణించాడు. జూన్‌లో పడాల్సిన వర్షాలు నెల రోజులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పంటలు ఆలస్యమైవుతున్నాయనే ఆందోళనలో ఉన్న రైతులకు రుతుపవనాల ఆగమనంతో పడుతున్న వర్షాలు రైతుల ముఖంలో ఆనందాన్ని నింపుతున్నాయి. దీంతో రైతులంతా జిల్లా వ్యాప్తంగా పంటలసాగు ప్రారంభించారు. జిల్లా పరిధిలో బుధవారం నుంచి వర్షాలు రాక ప్రారంభమవ్వగా ఆయా మండలాల్లో ఒక్కో రోజుగా వర్షాలు కురుస్తున్నాయి.

విత్తనాలు, ఎరువుల కొనుగోలులో బిజీ

ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు, పొలం పనుల్లో బిజీగా మారారు. నిన్నటి వరకు పొలాలు చదును చేసే పనుల్లో నిమగ్నమైన రైతులు విత్తనాలు వేస్తున్నారు. వ్యవసాయ శాఖ వానాకాలం పంటల సాగు అంచనాల ప్రకారం జిల్లాలో ఈ ఏడాది పత్తి, మొక్కజొన్న, కంది సాగులపై రైతులు ఎక్కువగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఆయా మండలాల వారీగా అందుబాటులో ఉంచామని అధికారులు వెల్లడిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 4,39,631 ఎకరాల్లో పంటసాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందుకు 20,661 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటాయని వివరించారు. పత్తి ఎక్కువగా సాగు అయ్యే అవకాశం ఉన్నందున 3,98,000 పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉంచేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే రైతులు ముందస్తుగా పెద్ద మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసి విత్తనాలు వేసే పనుల్లో ఉన్నట్లు తెలిపారు. ఎరువులు, విత్తనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాల రాకతో రైతులకు కూలీల కొరత మొదలైంది. అందరూ ఒకేసారి విత్తనాలువేసుకోవాలని చూస్తుండటంతో కూలీలు దొరక ఇబ్బంది పడుతున్నారు.

అదను దాటిపోలేదు.. విత్తనాలు వేసుకోవచ్చు



వర్షాలు ఇప్పుడే పడుతున్నాయి. రైతులు ఆందోళన చెందకుండా వర్షాలు సమృద్ధిగా కురిసి నేల పూర్తిగా తడిసిన తరువాతనే విత్తనాలు వేసుకోవాలి. అదును దాటిపోతుందనే ఆందోళన అవసరం లేదు. విత్తనాలు విత్తుకునేందుకు ఇంకా సమయం ఉంది. రైతులు హడావిడిగా విత్తనాలు వేయకుండా నాణ్యతతో కూడిన లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని చెప్పారు. నాసిరకం, నకిలీ విత్తనాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సాగులో విత్తనాల ఎంపికే కీలకమైనందున రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

– రమాదేవి, ఏడీఏ, చేవెళ్ల

అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కొందుర్గు: విశ్వనాథ్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కొందుర్గు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషిచేద్దామని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధికి అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సయ్యద్ హఫీజ్, నారాయణ రెడ్డి, రామకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

పూజారులకు నియామక పత్రాలు

మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో పూజారులను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి నియామక పత్రాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ .. ప్రభుత్వం పూజారులకు నెలకు రూ.10వేల చొప్పున వేతనం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈట నరేందర్, వివిధ గ్రామాల అర్చకులు పాల్గొన్నారు.

షాద్‌నగర్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ప్రభుత్వం ధూప దీప నైవేద్య పథకం కింద నియోజకవర్గ పరిధిలో 22 మంది అర్చకులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అర్చకులకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాక ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని అన్నారు. ఇప్పటికే యాదాద్రి దేవాలయాన్ని ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఎమ్మెల్యేను వేద పండితులు ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, ఈట నరేందర్, నారాయణరెడ్డి, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

షాద్‌నగర్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ప్రభుత్వం ధూప దీప నైవేద్య పథకం కింద నియోజకవర్గ పరిధిలో 22 మంది అర్చకులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అర్చకులకు ఎమ్మెల్యే వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఎమ్మెల్యేను వేద పండితులు ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, ఈట నరేందర్, నారాయణరెడ్డి, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సబ్బండ వర్గాల అభ్యున్నతి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్



నియామక పత్రాలను అందజేస్తున్న బాలరాజ్

షాద్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ గ్రామంలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, బీసీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మిద్దె యాదయ్య, ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా గోపాల్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా హర్యా నాయక్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్‌గౌడ్ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రఘు, శ్రీను నాయక్, అస్మత్ బాబా, ఎల్లప్ప, పెంటయ్య, రాజు, హరికృష్ణ, అనంతం, అంజయ్య, శివ, దాస్య నాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభివృద్ధే ఎజెండా



షాబాద్: మన్‌మర్రిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు



శంకర్‌పల్లి: ఏర్వగూడలో ప్రచారం చేస్తున్న తులసీరాం విజయ్ కుమార్

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి

షాబాద్: అట్టడుగు వర్గాల ప్రజల అభివృద్ధే ఎజెండాగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో 218వ బూత్ అధ్యక్షుడు గడ్డమీది రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారం అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నందున ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. మోదీ తొమ్మిదేళ్ల పాలన విజయాలను ప్రజలకు వివరించేందుకే మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. సర్పంచ్ సుహాసిని, ఉపసర్పంచ్ గోపాల్, నాయకులు శంకరయ్య, నాగేశ్, సురేశ్, శ్రీకాంత్, చింటు, రమేశ్, మహేందర్, రాజు తదితరులున్నారు.

మోదీ పాలనతోనే దేశాభివృద్ధి సాధ్యం

శంకర్‌పల్లి: ప్రధాని మోదీ పాలనలోనే దేశాభివృద్ధి సాధ్యమని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు వర్రి తులసీరాం విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని ఏర్వగూడలో గడప గడపకు బీజేపీ ఇంటింటికీ విజయన్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథనాలకు ప్రజలకు వివరించారు. ప్రధాని పరిపాలన మద్దతుకు 90909 02024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం 42శాతం నిధులు పెంచిదని వివరించారు. మిషన్ భగీరథలో భాగంగా ఇంటింటికి నల్లా పథకానికి జల జీవన్ పథకం క్రింద తెలంగాణకు 2018–22 సంవత్సరం వరకు రూ.2,500కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఆరేళ్లలో ఆహార సబ్సిడీ క్రింద రాష్ట్రానికి రూ.26,766కోట్లు విడుదల చేసిందన్నారు. జీఎస్టీ పరిహారం క్రింద రూ.2,379కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు కేంద్ర ప్రయోజిత పథకాల్లో భాగంగా రాష్ట్రానికి రూ.55,624కోట్లు విడుద చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు మహేందర్‌గౌడ్, నందు, సాయి, శివకుమార్, నర్సింలు, నవీన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



రెడ్డిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న కేఎస్ రత్నం

మొయినాబాద్: ప్రజా సంక్షేమానికే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత కేఎస్ రత్నం అన్నారు. పల్లె పల్లెకు రత్నం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని చందానగర్, మోత్కుపల్లి, రెడ్డిపల్లి, చిన్నమంగళారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రతీ కుటుంబానికి ఏదో ఒక ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతుందన్నారు. చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నుంచే పోటీ చేయడం ఖాయమని.. ప్రజలందరు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోత్కుపల్లి సర్పంచ్ రత్నం, హన్మంత్‌రెడ్డి, భాస్కర్, పెంటయ్య, గోపాల్, రాంరెడ్డి, ప్రభాకర్, యాదయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘నవ సంకల్ప్’కు తరలిన బీజేపీ నేతలు



షాద్‌నగర్: సభకు వెళ్తున్న బీజేపీ నేతలు

షాద్‌నగర్: నాగర్‌కర్నూల్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ నవ సంకల్ప్ సభకు షాద్‌నగర్ నుంచి పార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా కోర్టు ఎదుట నుంచి నాయకులు వాహనాల్లో ర్యాలీగా నాగర్‌కర్నూల్ తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, నాయకులు అందె బాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, మిథున్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వంశీకృష్ణ, భాస్కర్, వెంకటేశ్, మురళి, వెంకటేశ్, శ్రీనివాస్‌చారి, మోహన్‌సింగ్, మహేందర్ రెడ్డి, శివకృష్ణ, నరేశ్ తదితరులున్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ నుంచి..

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం నుంచి ఆదివారం నవ సంకల్ప్ సభకు బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య ఆధ్వర్యంలో పార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సందేశం వినేందుకు పార్టీ నేతలు, ప్రజలు స్వచ్ఛందంగా సమావేశానికి తరలారని చెప్పారు. సభకు వెళ్లిన వారిలో మురళి, హరీశ్, భీమయ్య, అంజి, ప్రభు, రామ్‌లక్ష్మణ్, సంగమేశ్, శ్రీరామ్ ఉన్నారు.

‘మీ చదువుకు నేను అండగా ఉంటా’

తలకొండపల్లి: నిరుపేదలకు అండగా ఉండి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రముఖ సంఘ సంస్కర్త ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూలపల్లికి చెందిన బైరపాక నాగార్జున, శశిరేఖ దంపతులు.. వీరికి ఇద్దరు పిల్లలు. పెద్ద కూతురు శిరీష నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎమ్మెస్సీ బయాలజీ, చిన్న కూతురు నాగమణి కల్వకుర్తి పట్టణంలో డిగ్రీ చదువుతున్నారు. నాగార్జున ఇటీవల మృతిచెందాడు. దీంతో తల్లిఆకి పిల్లల పోషణ, చదువుల ఖర్చు భారమైంది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న నారెడ్డి ప్రశాంత్‌రెడ్డి పిల్లలిద్దరికి అయ్యే చదువు ఖర్చులను తానే భరిస్తానని భరోసా పలికారు. ఆదివారం ఇంటికి వెళ్లి రూ.30,000 ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తుల్లో ఉన్నత విద్యకు సహాయం అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.



శిరీష, నాగమణితో మాట్లాడుతున్న ప్రశాంత్

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి



పాడి కౌశిక్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

ముదిరాజ్ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్

శంకర్‌పల్లి: ముదిరాజ్ కులస్తులపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం శంకర్‌పల్లి పీఎస్ వరకు ర్యాలీ నిర్వహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూట్యూబ్ చానెల్ రిపోర్టర్ అజయ్ ముదిరాజ్‌ను కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురి చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజ్ కులస్తులకు బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఆయనపై చర్యలు తీసుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం యువజన విభాగం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మైసయ్య, నాయకులు మల్లేశం, నర్సింలు, యాదయ్య, లింగం, నారాయణ, పాండు, వెంకటేశ్, తిరుపతి, రాజు, వెంకట్‌రాం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

తండాల్లో నేటికీ ఇందిరమ్మ ఇళ్లే..

కాంగ్రెస్ నేత శ్రీను నాయక్



కాస్లాబాద్ తండాలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: ఇరుకుగా ఉన్న ఇందిరమ్మ ఇండ్లు కాదు పేదలకు విశాలమైన డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన అధికారంలోకి వచ్చిన సీఎం నేడు పట్టించుకోవడం లేదని జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్‌లో కాంగ్రెస్ నేత శ్రీను నాయక్ విమర్శించారు. తండాల్లో నేటికీ ఇందిరమ్మ ఇళ్లే ఉన్నాయని గుర్తు చేశారు. ఆదివారం ఆయన తండాలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. తండాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్న సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో చేసిందేమీలేదన్నారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు గిరిజనులు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, నాయకులు గోపాల్‌నాయక్, రమేశ్ నాయక్, సంజునాయక్, సంతోశ్ నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మహాసభలు

డీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కిష్టప్ప



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి కిష్టప్ప డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో డీటీఎఫ్ రాష్ట్ర వైజ్ఞానిక మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కిష్టప్ప మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 317 జీఓను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ గడువు ముగుస్తున్నందున కమిటీ వేసి ఐఆర్ ప్రకటించడంపై ఉపాధ్యాయులు వేచి చూస్తున్నారని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోవడంతో ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మేధావులు, ప్రజాస్వామిక వాదులు, కార్మికులు, రైతులు పడుతున్న బాధలను, విద్యారంగం సమస్యలపై చర్చించేందుకు అక్టోబర్‌లో నిర్వహించే డీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జునరావు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఫరూఖ్‌నగర్ మండల కన్వీనర్ రవీంద్రనాథ్, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు అర్జునప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.